క్లుప్తంగా

నేడు శివపార్వతుల కల్యాణం

కోస్గి: పట్టణంలోని తిమ్మనబావి శివాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు శివ మాలధారులు తెలిపారు. ప్రతియేటా మూడు రోజులపాటు నిర్వహించే శివరాత్రి వేడుకల్లో భాగంగా ఈ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 7:05 గంటలకు నంది సహిత గోమాత పూజ, 8:05 గంటలకు స్థానిక వీరభద్రస్వామి ఆలయం నుంచి శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు, 9 గంటలకు గణపతి, గౌరీ పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లికి చెందిన కృష్ణయ్య కుటుంబ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందించారు. కృష్ణయ్య కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు బ్రెయిన్ ఆపరేషన్ నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఓబులాపూర్ మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, నర్సింహ, సుదర్శన్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్‌ను బలోపేతం చేద్దాం

నారాయణపేట టౌన్: విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా డా.రాంబాబు ను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని అన్నోజిగూడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా వీహెచ్‌పీ జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డా.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కన్న శివకుమార్, సహ కార్యదర్శిగా మద్దూరు సాయప్ప ఎన్నుకున్నారు. సంస్థాగతంగా విశ్వహిందూ పరిషత్‌ను బలోపేతం చేయాలని నూతన కమిటీకి బాలస్వామి సూచించారు.

'చర్యలు తీసుకోవాలి'



అమరచింత: శ్రీచైతన్య విద్యా సంస్థల్లో చోటు చేసుకుంటున్న విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించాలని, విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని నందిమళ్లలో పీడీఎస్‌యూ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్యలు ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబాలకు రూ.50లక్షలు ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను వెంటనే తొలగించాలని కోరారు. రాష్ట్రంలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో దీవెన్, సాయికుమార్, శివ, రాఘవేంద్ర, అనిల్, ఉదయ్ పాల్గొన్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక చింతన

కొత్తకోట రూరల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఆదివారం పెద్దమందడి మండలంలోని చిలకటోనిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివరాత్రి విశిష్టతను తెలియజేశారు. శివలింగం పైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మకు గుర్తు అని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. అందుకే మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడతారని, మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికంలో ముఖ్యమైన విషయమని తెలిపారు. శివరాత్రి జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానం తెలియజేయడమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితర సభ్యులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



మక్తల్‌లో..



మరికల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి గాను గురుకులాల్లో 5, 6, 8, 9 తరగతుల ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష పట్టణంలో ఆదివారం ప్రశాతంగా ముగిసింది. మక్తల్‌లో ఊట్కూర్ గురుకుల, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, బాలికల గురుకుల యల్లమ్మకుంటలో, బీసీ గురుకుల బాలుర పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాలలో మొత్తం 446 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 427 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 19మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, ఎంఈఓ అనిల్‌గౌడ్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరికల్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి కోసం నిర్వహించిన కామన్ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 795 మంది విద్యార్థులకు గాను 773 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ మణిమాల తెలిపారు. 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

26 నుంచి భైరంకొండ ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని భైరంకొండ గ్రామ అమ్మవారి తోట శివాలయంలో బుధవారం నుంచి రెండు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 26న ఉదయం 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు, సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం, రాత్రికి భజన కార్యక్రమం ఉంటాయన్నారు. అదేవిధంగా 27న అభిషేకం, మహా నైవేద్యం, భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపడతారు. ఉదయం 10 గంటల నుంచి రిటపట్ల కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చిన్నారులకు నృత్య పోటీలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని చిన్నారులకు దైవభక్తి పాటలపై నిత్య పోటీలు నిర్వహిస్తున్నారు. 26న సాయంత్రం ఐదు గంటలకు పాఠశాలల వారీగా విద్యార్థులు డాన్సులు చేయాలని సూచించారు. చక్కటి ప్రతిభ కనబరిచిన గ్రూపునకు మొదటి బహుమతిగా రూ. 3వేలు, రెండో బహుమతిగా రూ. 2వేలు, మూడో బహుమతిగా రూ. వెయ్యి నగదు బహుమతి, కొరియోగ్రాఫర్ బహుమతి కింద రూ. 1,500 అందిస్తామన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

కొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవ పూజలు సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం గణపతి పూజ, అఖండ దీపారాధన, షోడశ స్తంభ పూజ, ద్వార పూజ, వేద మంత్రములచే మండప ప్రవేశం, విగ్రహాలకు జలాధివాసం, మహా మంగళహారతి, మంగళవారం హోమాలు, మృత్తికాధివాసం, పంచామృతాధివాసం, బుధవారం హోమాలు, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా



సింగారం గేట్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రానికి తాగునీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్లైన్ మండలంలోని సింగారం గేట్ సమీపంలో పగిలిపోయింది. నాలుగు రోజులుగా పైప్‌లైన్ లీకేజీ అయి తాగునీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్రెడ్డి పర్యటన అటుగా జరుగుతుండడంతో లీకేజీ బయటికి కనిపించకుండా నీటి సరఫరాను నిలిపివేసినట్లు సమాచారం. అయితే రెండు రోజులుగా పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయకుండానే తిరిగి నీటి సరఫరాను పునరుద్ధరించడంతో పెద్ద మొత్తంలో తాగునీరు వృథాగా పోతుంది. వెంటనే పైప్‌లైన్ లీకేజీని సరి చేసి తాగునీటి సరఫరాను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వేసవికాలం మొదలు కావడంతో తాగునీటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఉప్పుకుంట ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామాన్ని ఆనుకొని ఉన్న పురాతన ఉప్పుకుంట ఆనకట్టను పట్టాభూమి పేరుతో ధ్వంసం చేయడాన్ని నిలిపివేయాలని కాన్‌కుర్తి కురమ సంఘం, కాంగ్రెస్ నాయకుడు భీంరెడ్డి కోరారు. ఏళ్లుగా ఉన్న కుంట కట్టను ధ్వంసం చేయడంతో సమీపంలో నివాసమున్న గ్రామస్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు భవన నిర్మాణ సంఘం మహాసభ

అమరచింత: ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు తెలిపారు. జిల్లా ఏర్పడి నేటికీ పదేళ్లు అవుతున్నా రెగ్యులర్ లేబర్ అధికారులు లేకపోవడం శోచనీయం అన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా కార్మికులకు అందాలంటే లేబర్ అధికారులను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

50 తోపుడు బండ్లు పంపిణీ



తోపుడు బండ్లను అందజేస్తున్న సఫా బేతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ సభ్యులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలో సఫా బేతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ సంయుక్తంగా పేదరిక నిర్మూలన, అర్హులైన వారికి ఆర్థిక స్వావలంబన కల్పించే ఉద్దేశంతో సుమారు రూ.8 లక్షల విలువైన 50 పుష్కల బండ్లను ఆదివారం స్థానిక మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవెంట్ మేనేజర్ మహమ్మద్ ఇష్తియాముద్దీన్ మాట్లాడుతూ సమాజంలోని అర్హులైన వారికి గౌరవప్రదమైన ఉపాధిని అందించడంతో పాటు, వారిని ఆర్థికంగా స్వతంత్రంగా మార్చడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ క్రమంలో సఫా బేతుల్ మాల్, రహబర్ ఫౌండేషన్ కలిసి 50 పుష్కల బండ్లను పంపిణీ చేశామని, ఇందులో 35 పండ్ల బండ్లు, 15 కూరగాయల బండ్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహమ్మద్ దానిష్ (సర్వే ఆఫీసర్), మహమ్మద్ సమీర్, అబ్దుల్ మాజిద్, అబ్దుల్ రహీమ్, సయ్యద్ ఫయాజ్, ఎండీ హమీద్, సయ్యద్ షా ఘియాసుద్దీన్ ఖాద్రీ (సజ్జాదా నశీన్, బార్గాహ్ తఖీ బాబారహ, నారాయణ్‌పేట), హాజీ మహమ్మద్ నవాజ్ మోసీ, అబ్దుల్ సీం అడ్వకేట్, అమీర్‌ఉద్దీన్ తదితరులు హాజరయ్యారు.

25న సైన్స్ ఫేర్

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలోని లిటిల్ స్టార్ హైస్కూల్‌లో ఈనెల 25న సైన్స్ ఫేర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, ప్రిన్సిపాల్ శేఖర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్‌ఫేర్‌లో దాదాపుగా 100 ప్రయోగాలతో విద్యార్థులను ఆలోచింప చేసే విధంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.

వీరాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం



యంత్ర ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- కనులపండువగా ధ్వజస్తంభం వేడుకలు
- వందలాదిగా తరలివచ్చిన భక్తులు

వనపర్తి టౌన్: 400 ఏళ్ల నాటి పాతబజార్‌లోని సీతారామ సైత వీరాంజనేయ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాస్థాపన, బొడ్రాయి ప్రతిష్ఠ, శయాధివాసంలో ఉన్న దేవతామూర్తులను మూల నక్షత్ర యుక్త మీన లగ్నంలో యంత్ర ప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాలకు జీవకళ ఉట్టిపడేందుకు జీవన్యాసము, నేత్రోన్మీళనం చేపట్టారు. అనంతరం కామధేనుతో దేవతామూర్తులను దర్శించుకోవడంతో మూడు రోజులుగా నడుస్తున్న పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శంకు, చక్రాలు, త్రిశూలం, నాగదేవతామూర్తుల కలిగిన 42 అడుగుల ఎత్తైన ఏకశిల ధ్వజస్తంభం ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు చేసిన శ్రీరామ నామస్మరణ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అంతకుముందు భక్తులు ఏకశిల ధ్వజస్తంభానికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆలయం ఇన్నాళ్లు రహదారి కిందిభాగంలో ఉండేదని, ప్రస్తుతం ఆలయం పున: ప్రతిష్ఠతో ఆలయానికి శోభ చేకూరిందని భక్తులు, ప్రముఖులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ, ధీరజ్‌శర్మ, నరేందర్‌శర్మ, శాంతికృష్ణశర్మ, రాజకీయ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



క్రేన్ సాయంతో ఏకాశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న ప్రజలు

సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థుల క్షేత్ర సందర్శన



జేపీ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు

మద్దూరు: మండలంలోని పెదిరిపాడ్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 200 విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ఆదివారం జిల్లా కేంద్రంలోని జేపీ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శనకు తీసుకెళ్లినట్లు పాఠశాల హెచ్‌ఎం బాలకిష్టప్ప తెలిపారు. ఫాంహౌజ్‌లో డాక్టర్ చంద్రమోహన్ ఆర్గానిక్ వ్యవసాయంపై, దాని వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాడకం గురించి వివరించారు. సేంద్రియ ఎరువుల వల్ల పండిన పంటకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఓ నాగార్జునరెడ్డి, డీఎస్‌ఓ భానుప్రకాష్, ఉపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాసం, రాజరత్నం, రవీందర్‌రెడ్డి, శబరి, స్వప్న, యుగంధర్‌రెడ్డి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులతో గోపాలం

మక్తల్: రాష్ట్రస్థాయి సైక్లిలింగ్ మౌంటెన్ పోటీలకు మాగనూర్‌కు చెందిన శ్రావణి, అఖిల, చిన్నపొర్లకు చెందిన గాయత్రి, గణేష్, కర్నికు చెందిన మల్లేశ్వరి, బొందల్‌కుంటకు చెందిన సాక్షిత, రోహిత్, చిట్యాలకు చెందిన శివకుమార్, శ్రీపాద, ముదుమాల్‌కు చెందిన త్రివేణి, పరశురాములు, అనూష, రాయికోడ్, బిజ్వార్‌కు చెందిన రమేష్, కొత్తపల్లికి చెందిన రాథోడ్, రవి, దాసర్‌పల్లికి చెందిన రాఘవేందర్, మక్తల్‌కు చెందిన కార్తీకేయ ఎంపికై నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు. వీరు మార్చి 7 నుంచి 9 వరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీ రమేష్, మీనాకుమారి, గాయత్రి, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పటాలోత్సవం



చిన్నారులకు పటాలు కట్టిన తల్లిదండ్రులు

ధన్వాడ: మండలంలోని హన్మాన్‌పల్లిలో ఆదివారం పటాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బీరప్ప విగ్రహాలను గ్రామం నుంచి ర్యాలీగా కోయిల్‌సాగర్ వరకు తీసుకెళ్లి ఏటినీటితో శుద్ధి చేశారు. గ్రామంలోని బయటి దేవాలయం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు పటాలు కట్టి పటాలోత్సవం నిర్వహించారు. కురుమలు ప్రతి ఐదేళ్లకోసారి బీరప్ప బండారు ఉత్సవాలు చేస్తామని కురుమలు తెలిపారు. కార్యక్రమంలో కలప్ప, ఆశప్ప, శ్రీశైలం, మల్లప్ప, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే సమస్యలు పరిష్కరించాలి



జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రానిస్తున్న ఏఈఓలు

మరికల్: డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదులో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసే విషయంలో అనేక ఇబ్బందులు తలెత్తున్నాయని జాన్ సుధాకర్‌కు వివరించారు. తమ సెల్‌ఫోన్లలో సర్వే వివరాలను నమోదు చేయడం సమస్యలు వస్తున్నాయని, వ్యవసాయ శాఖ పరంగా నూతన మొబైల్ ఫోన్లు ఇప్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులు ఒంటరిగా సర్వే కోసం వెళ్లడానికి భయపడుతున్నారని, ఈ విషయంపై అధికారులు ఆలోచన చేసి వారిని సర్వే నుంచి తొలగించాలని కోరారు. అలాగే రైతు భరోసా విషయంలో 3 ఎకరాల లోపు ఉన్న రైతులకు డబ్బులు పడకపోవడంతో రైతులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

'బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణనలో ముస్లిం మైనార్టీలను బీసీలలో చేర్చొద్దని కేంద్రమంత్రి బండి సంజయ్ సూచించడం తగదని ముస్లిం జేఏసీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2016లో జస్టిస్ సచార్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సుల మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. విద్య, ఆర్థిక, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో ముస్లింలు అందరి కంటే పేదరికంలో ఉన్నారని తెలిపారు. రాష్ట ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ముస్లింలను బీసీలో చేరిస్తే పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని బీజేపీ కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటించడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. బీజేపీ ముస్లిం వ్యతిరేకంగా ఉందనే విషయం వారి మాటల్లోనే తెలుస్తుందని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో తౌఫిక్, నబి, పాషా, దస్తగీర్, నిసార్, అబేద్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ జాతర



అలంకరణలో ఈదమ్మ మాందాతలు



గాజులు వేయించుకుంటున్న మహిళలు

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఆదివారం ఈదమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తు కొందరు కోడిపుంజులు, పొటేళ్లు అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సంతబజారు వరకు తినుబండారాలు, గాజులు, స్వీట్లు, ఆట వస్తువులు తదితర వాటి స్టాళ్లు ఏర్పాటు చేశారు. వారం రోజుల పాటుగా జాతర కొనసాగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ రోడ్డుకు మరమ్మతు



ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాట్లు చేపడుతున్నామని ఆలయ చైర్మన్ వెంకట నర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధానకార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయకార్యదర్శి తెలుగు నాగేష్, పూజారి కర్బసయ్య తెలిపారు. ఆలయానికి వెళ్లేందుకు ఆదివారం మట్టిరోడ్డును బాగుచేయించారు. పరిసరాల్లో పేరుకుపోయిన ముళ్ల పొదలను జేసీబీ ద్వారా తొలగించారు. మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనులపండుగగా జరుగనుందన్నారు. వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని, మార్చి 3న సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్స వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.